# మూడో ఓటమి

వేమారెడ్డికి మనస్సు చాలా చికాకుగా వుంది. ఉదయం నించీ పులిజూదం ఆడటానికి అతనికెవరూ తోడు దొరకలేదు. శివరాత్రి కావటంతో వూళ్లో వుత్సాహవంతులైన వృద్ధులూ, భక్తితత్పరులైన యువకులూ, స్త్రీలూ, పిల్లలూ అంతా సమీపంలో వుండే క్షేత్రాలకి వెళ్ళిపోయారు. శివుడిని చూడాలనుకునేవారూ, ఎడ్ల పందాలూ, అందచందాలూ చూడాలనుకునేవాళ్లూ అందరూ వెళ్ళిపోయారు.

వేమారెడ్డి వయస్సు అరువదుల్ని సమీపిస్తుంది. ఆరోగ్యం అంతంత మాత్రంగా వుంటోంది. బి.పి. వుంది. అప్పుడప్పుడూ గుండెపోటు కూడా వస్తూ వుంటుంది. అతనిలో భగవద్దర్శనాభిలాష లేదు. పందేలు చూడాలన్న ఉత్సుకతా లేదు. అందచందాలు వీక్షించి ఆస్వాదించే ఉత్సాహమూ లేదు.

అతనెప్పుడూ యింట్లో కోడలు వండిపెడితే సుష్టుగ భోజనం చేసి దేవాలయం చేరుకుని పులిజూదం ఆడటంలో కాలం గడుపుతాడు. రోజూ తొమ్మిది దాటాక తాంబూలం నములుతూ వచ్చిన వ్యక్తి మళ్ళీ యింటికి మళ్ళేది సాయంకాలమే. ప్రొద్దు క్రుంకుతూనే భోజనం చేయడం తనకు వచ్చిన గజేంద్రమోక్షంలోవీ, రుక్మిణీకల్యాణంలోవీ, ప్రహ్లాద చరిత్ర నుంచి చిన్నప్పుడు చదువుకున్న శతకాల నుంచి పద్యాలు చదువుతూ నిద్రపోవటం అతని మార్పులేని నిత్య కృత్యం.

శివరాత్రి వెళ్ళి రెండురోజులయినా జనం యింకా తిరిగి రాలేదు. దేవాలయంలో ఒంటరిగా వీరభద్రుడల్లే వుండిపోయాడు వేమారెడ్డి పిచ్చి ఎక్కినట్టుగ వుందతనికి. మూడురోజుల్నించి ఆడటానికి తగిన వ్యక్తి దొరకకపోవటంతో అతనికి తనే స్వంతంగా ఆడుకుందామా అనిపించింది. పేకతో పేషన్స్ ఆడుకోవచ్చుకానీ పులి జూదం ఆడటం-ఒంటిగా-సాధ్యం కాదు. అయినా అతనికి కుతిదీరక-చావక-పులుల్నీ మేకల్నీ ముందేసుక కూర్చున్నాడు.

వరుసగా పులుల్ని పేర్చాడు. ఓ చివారన మేకని వుంచేడు. ఇక పులి కదలాలి. ఎదుట ప్రత్యర్థి వుంటే అతని కవచమూ గుండే దూసుకపోయేట్టుగా ఖడ్గాన్ని దూయొచ్చు కానీ తనకవచాన్ని, తననీ తన ఖడ్గంతోనే దూసుకోవటం సాధ్యమా ?

ఆకాశంలో పిట్ట ఆడటం లేదు. ఇంటి యజమాని పోయిన నాటి యిల్లులా వుంది

పూరు. 'అప్పుడే ఎండలు ముదిరాయి. తెగ పుక్క పోస్తుంది.' అనుకున్నాడు వేమారెడ్డి. తిరిగి పులుల్ని, మేకల్ని జత చేశాడు. అక్కడి నుంచి లేచి బజార్న ఎవరయినా వస్తారేమోనని చూడసాగాడు.

అల్లంత దూరాన వస్తున్న కుర్రాడ్ని చూడగానే వేమారెడ్డి ముఖం వికసించింది. వాడెవడయినా కానీ తన కుతి తీర్చటానికి దేవుడల్లే వస్తున్నాడు. వాడిని వదలకూడదు. ఎలాగయినా వాడితో ఆడించాలి తన ఆట తెలిసిన వాడెవడూ తనతో ఆడడు. తన జతగాండ్రు తనతో ఆడాలని తహతహలాడేవాళ్ళు తప్ప యింకొకరు తనతో ఆడాలంటే ఎంతో ప్రాధేయపడితే కానీ తను అంగీకరించడు. తనతో ఎవడయినా కొత్తగా ఆడితే వానికి పద్మశ్రీ లభించినంతగా పొంగిపోతాడు. వూళ్ళో అందరికీ చెప్పుకుంటాడు. అవును తనతో ఓడిపోవటం కూడా ఓ ఘనతే !

మరుసటి రోజు అంతా తనని అడిగే వాళ్ళే. వివరంగా ఎన్ని ఎత్తుల్లో కట్టేసిందీ తెలుసుకునే దాకా విడవరు. మేకలు తీసుకుంటే ఎన్ని మిగిల్చి కట్టేసింది. పులులెత్తుకుంటే ఎన్ని మేకల్ని చంపింది ఎక్కడెక్కడ ఖాళీ వదిలిందీ వివరంగా చెప్పంది వదల్రు. తనతో ఆడేప్పుడు ఆ ఎత్తులు వేయాలని చూస్తారు. కానీ తను చండ భానుడు. అలాటి చిన చిన్ని ఎత్తులు తన ఎదుట పారవు.

ఆ కుర్రాడు దగ్గరగా వచ్చాడు.

తేరిపార చూశాడు వేమారెడ్డి.

తను వూరివాడు కాదు. పక్క బజారు కృష్ణారావు మేనల్లుడు నరసింహారావు. ఫరవాలేదు. కొత్తవాడు. తనతో ఆడటానికి జంకడు. ఏదో రెండాటలు ఆడవచ్చు. వాడితో ఆడటం తనకి గోలీలాడినట్టే. అయినా తప్పదు. సింహం జీర్ణతృణాన్ని వాసన చూస్తోంది.

'ఒరే అబ్బాయ్!'

దేవాలయం సమీపానికి వచ్చి అటుగా తిరగబోతున్న ఆ అబ్బాయి చూశాడు.

'ఏమిటి పెద్దయ్యా.'

'ఇలా రారా నాయ్నా!'

చుట్టూ తిరిగి వేమారెడ్డి కూర్చున్న చోటుకి వచ్చేడతను.

ఆసరికి పులుల్ని పేర్చి మేకల్ని చేతిలో జాగ్రత్తచేసి కూర్చున్నాడు వేమారెడ్డి.

'రా! రా! చిన్నోడా రారా! ఓ ఆట వేద్దాం.'

'నాకేం రాదు పెద్దయ్యా!'

ఉస్సురన్నాడు వేమారెడ్డి క్షణం సేపు. కానీ వెంటనే పుంజుకుని 'ఒరే పులిజూదం రాదనే కాపోడు కాపోడే కాదురా! బీడీ కాల్చంది మొగోడు కాదన్నట్టు పులిజూదం ఆడ్తేనే మొనగాడు దా ! దా! కూర్చుని ఆడుతుంటే అదే వస్తుంది' అన్నాడు ప్రోత్సహిస్తూ.

'అబ్బే! నాకూ బొత్తిగా రాదు పెద్దయ్యా!'

'నేనో మాట చెపుతా వింటావూ? ఇవిగో మేకలు. యిలా గదుల వెంట వేస్తూ రా! అదే వచ్చేస్తుంది. ఒకటి రెండాటలు నే నోడితితేనేం నువ్వోడితేనేం. ఫరవాలేదు. మనలో మనకేం. ఇందులో పెద్దగా మునిగిపోయేదేం లేదు' అన్నాడు పూరిస్తూ.

నరసింహారావు మాటాళ్లేదు.

"కూర్చోరా నాయనా! మరీ కొత్త నులకమల్లే బిగుసుకోకు. నాతో ఆడితే నీ పరువేం పోదు" అన్నాడు నిష్ఠూరంగా.

"నీకు బాగా వస్తుందా?"

వెంటనే అబద్ధం ఆడేడు వేమారెడ్డి! 'నాకూ రాదురా చిన్నోడా! రోజూ అందరూ యిక్కడ కూర్చుని ఆడతా వుంటే చూస్తూ వుంటాను. ఈ రోజు అంతా యాత్రలకి వెళ్లటంతో ఖాళీగా వుంది. కానీ లేకపోతే యిక్కడ ఆడేవాళ్లూ చూసేవాళ్ళూ అంతా తిరనాల లాగా వుంటుంది. కూర్చుని చూడడానికి కూడా స్థలం వుండదు. చూడు యీ బండ ఎంతగా అరిగిపోయిందో ఆడి ఆడి'.

'సరే! సరే! నువ్వోడితే నేనేమనను కానీ నే నోడిపోతే ఏమయినా అంటే మాత్రం పడను తెలుసా?' అని ఆటకు కూర్చున్నాడు ఆ అబ్బాయి మేకలు అందుకుంటూ.

తనలో తను నవ్వుకున్నాడు. వేమారెడ్డి. 'తను ఓడతాడా?' అనుకున్నాడు.

ఆట ప్రారంభమైంది.

మొదట చెవుల వారగా పెట్టేడు ఓ మేకని. పులి కదిలింది. అతను మరో మేకని వేసేడు మధ్యగా. పులి కదిలింది మళ్ళీ. అలా అలా ఆట సాగిపోయింది పది... పదిహేను... ఇరవై నిమిషాలు గడిచిపోయాయి. ఇక పులి కదలటానికి స్థలం లేదు. ఆ అబ్బాయి చేతిలో ఓ మేక మిగిలిపోయింది.

ఆశ్చర్యపోయాడు వేమారెడ్డి.

భీష్ముడు అభిమన్యుడి చేతిలో ఓడినట్టుంది అనుకుని నవ్వుకున్నాడు. తర్వాత తను బొట్టికాయ చేతిలో ఓడిపోవటం గుర్తుకొచ్చి మనస్సు కలుక్కుమంది. కొత్త కుర్రాడు ఆట రాదు కదా అని తను నిర్లక్ష్యంగా పరధ్యానంగా ఆడేడు. ఫలితం తన ఆట పోయింది.

తనకి గెలవటం లీలాజాలం! ఓడటం కొత్త అనుభూతం. గెలుపోటాలు సరి సమాన కక్ష్యలోనివి. అయినా ఎందుకో అదోలా ఉంది. అయితేనేం వీడు కొత్త కుర్రాడు. ఎలాగయినా ఫరవాలేదు. ఏ ముంది ? మరో రెండాటలు ఆడి ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తే సరి ? తన ఆశ కానీ యీ ఆట ఓడిపోతే మూడో ఆటకి వస్తాడా మళ్ళీ, బెంబేలెత్తిపోడూ ?

ఆలోచనల్ని అణుచుకుని ఆ కుర్రాడి ముఖం కేసి చూశాడు వేమారెడ్డి. నవ్వుతున్నాడా అబ్బాయి.

అది హేళన కాదు. ఆనందం కాదు. వెఱ్ఱి నవ్వు.

'నీకూ ఆట రాదు. నాకూ ఆట రాదు, ఇద్దరం ఇద్దరమే! అయినా నేను గెలిచాను చూడు' అన్నట్టుందా నవ్వు.

వేమారెడ్డి ముఖం ముడుచుకోలేదు. ఓడినందుకు ఆట్టే బాధపళ్లేదు, 'తను కోపగించుకుంటే ఆ కుర్రాడు భయపడతాడు. వెళ్ళిపోతాడు. అలా జరగటానికి వీల్లేదు, ఇంకా ఆడుకోవాలి తన కుతి కొంతయినా తీరాలి' అనుకున్నాడు.

'యీసారి నువ్వు పులుల్ని తీసుకో.'

తలూపి పులుల్ని పేర్చాడా అబ్బాయి.

మేకల్నందుకున్నాడు వేమారెడ్డి.

ఈ పర్యాయం బహు జాగ్రత్తగా ఆడేడనుకున్నాడు వేమారెడ్డి. ప్రాణానికి వెలకట్టి ఆడేడు. అయినా కాలం చకచకా గడిచిపోయింది. ఆ అబ్బాయి చేతిలో మూడు.... నాలుగు.... మేకలున్నాయ్,

మేకని కదిల్చాడు వేమారెడ్డి.

తన పులితో ఆ మేకని చంపేసి 'పెద్దయ్యా! యిక ఆట అయిపోయింది. నీవు కట్టెయ్య లేవు' అని లేచాడు నవ్వుతూ.

వేమారెడ్డి ముఖం ఎఱ్ఱనైంది.

'ఆగరా కుర్రాడా! ఆగు ! ఏదో కొత్తవాడివి కదా అని నిర్లక్ష్యంగా ఆడాను, ఇంకో ఆట ఆడు. నా సంగతి తెలుస్తుంది. నవ్వినట్టు కాదు' అన్నాడు రోషంగా.

పక పక నవ్వాడా అబ్బాయ్

'నీ సంగతి బాగా తెలిసిపోయింది పెద్దయ్యా! నీకేం రాదు. రోజూ ఆట చూస్తున్నావే కాని దానిపట్టు తెలుసుకోలేక పోయావు పురాణం రోజూ జరుగుతూ వున్నా యీ స్తంభాలకి ఎంత తెలుస్తుందో నీకూ అంతే!'

'రేయ్! నేనెవర్నో తెలుసా?'

'వూఁ.'

'నీ ముఖం నీకేం తెలుసు? నే నెవర్నో తెలిస్తే నాతో ఆడేవాడివే కాదు. నా పేరు అడిగి తెలుసుకో. ఇంత వరకూ ఈ వూళ్ళోనే కాదు: యీ చుట్టుపట్ల కూడా నన్ను ఓడించినవాడు లేడు. అసలు నాతో ఆడటం ఓ పండుగ. నాతో ఓడటం ఓ విజయం – నాతో ఓడటం ఓ ఆనందం తెలుసా!'

'కాయ్! కాయ్! నీ ఆట ఎంతో నాకు యీ రెండాటల్లోనే తెలిసిపోయింది. నీవేఁ పులి వేమారెడ్డివా?'

వేమారెడ్డి ముఖం మాడిపోయింది.

'కొత్తాడివి! బాగా ఆడితే వూపిరి తిరక్క బెదరిపోతావని అలా ఆడాను. నీవూ ఏదో అదృష్టంతో గెలిచావు ఇంకో ఆట వెయ్ చూద్దువుగానీ.'

'ఇంకో ఆటా? నీతోనా? ఇదిగో పెద్దయ్యా! నీకు పొద్దు గడవకపోతే నా వెంట రా! పొలాలకి వెళ్లొద్దాం. ఊరికే సోమరిలా కూర్చుని ఆటలు ఆడుతూ గడపాలని అనుకోవద్దు. సోమర్లు బ్రతికే సమాజం కాదిది. కష్టపడాలి. శ్రమించాలి. సంపాదించాలి. అనుభవించాలి. పెద్దలు సంపాదించింది తిని బ్రతకటం మంచిది కాదు.'

ఆ కుర్రాడు కదిలిపోబోయాడు.

'అయితే యింకో ఆట వెయ్యనా?' నీరసంగా అడిగేడు వేమారెడ్డి.

'ఊహూఁ నీకేం వచ్చని ఆడాల. ముందుగా ఆట బాగా నేర్చుకో. మళ్ళీ ఎప్పుడైనా ఆడదాం.'

'అబ్బాయ్!'

'ఇంకా ఏమిటి పెద్దయ్యా!' విసుగ్గా అడిగాడు.

'ఇదిగో! నేను యిలా ఓడిపోయానని ఎవ్వరితోనూ అనకు.' బేలగా అడిగాడు వేమారెడ్డి.

అది విని, చూసి, పకపక నవ్వాడు ఆ కుర్రాడు. 'ఇదిగో పెద్దయ్యా! నీదేదో చాదస్తంలాగా ఉంది. నీవేంపెద్దాటగాడివని నిన్ను గెలిచానని కోస్తా కోస్తా దండోరా వేస్తాను? మరేం భయపడకు. నీకూ ఆటరాదు. నాకు ఆట రాదు. ఏదో నేను గెలిచాను. నువ్వు వోడావు. అంతే! మరేం లేదు' అనునయంగా అన్నాడతను.

ఆ అబ్బాయి కదలిపోతూ ఉంటే నిలువు గుడ్లేసుకని చూడసాగాడు వేమారెడ్డి. అతని ప్రాణాలు కదలిపోతున్నట్టుగా అనుకున్నాడు. అ అబ్బాయి కనుమరుగయ్యేక చేతిలో నున్న కాయల్ని చూసుకున్నాడు. అతనికి చెప్పరాని అసహ్యం వేసింది. ఎన్నో యేళ్లుగా అభిమానంతో ఆడుతూ, ఆడిన ప్రతి ఆటా గెలుస్తూ ఆ ప్రాంతంలో 'పులి' వేమారెడ్డిగా ప్రసిద్ధికెక్కి యిలా యీ బొట్టికాయ చేతిలో ఓడటం అతనికి ప్రాణాంతకం అయింది.

దుఃఖంతో రోషంతో తనపై తనకే ఏర్పడిన అసహ్యంతో చేతిలో వున్న కాయల్ని ఏసిరికొట్టాడు దూరంగా.

✧ ✧ ✧

జీవచ్ఛవంలా వచ్చిన మామగారిని చూసి భయపడింది జయప్రద. పడగ మీద దెబ్బతిన్న త్రాచులా వున్నాడు వేమారెడ్డి. ఆయన్ని పలుకరించటానికే జంకింది జయప్రద.

వెళ్ళి నులకమంచం వాల్చుకుని పై పంచ తలక్రింద వేసుకుని పడుకున్నాడు వేమారెడ్డి. పోట్లగిత్తతో దెబ్బతిన్నట్టుగా వున్నదతని మనస్సు. క్షణక్షణానికి తను ఓడిపోవటం, ఆ కుర్రాడి నవ్వు, వాడి ఓదార్పు మాటలు అతని మనస్సు తూట్లు పడగొడుతున్నాయ్.

'నీవేం పులి వేమారెడ్డివా?' అన్న మాటలు చెవుల్లో గింగురుమంటూ ధ్వనిస్తున్నాయ్.

అతని కళ్ళముందు ఆ సన్నివేశం మళ్ళీ తిరగసాగింది. అతన్ని తను ఆటకి ఆహ్వానించటం చాలా ఘోరమైన తప్పిదంగా భావించసాగాడు. వేజారిపోయి ముక్కలై పోయిన

మట్టికుండకై విలపించే వెర్రివాడిలా జరిగిన సంఘటన గూర్చి బాధపడసాగాడు.

గిఱ్ఱున తల తిరగసాగింది. గుండె తీవ్రంగా కొట్టుకోసాగింది.

'తాతయ్యా! తాతయ్యా!'

పట్టి కుదుపుతూ పిలుస్తున్న పిలుపుకి బలవంతంగా కళ్లు తెరిచాడు వేమారెడ్డి. ఆ కుర్రవాడు !

వేమారెడ్డి యముడిని చూసి భయపడ్డ మార్కండేయునిలా అయ్యాడు. అతని గొంతు తడారిపోయింది.

'నన్ను క్షమించు తాతయ్యా! నేను చాలా హేళనగా మాట్లాడాను," కన్నీళ్ళతో అన్నాడు ఆ కుర్రాడు.

వేమారెడ్డి గుండెలు గుభిల్లుమన్నాయ్.

'ఏ...మి...టి? ఏ....మి....టి?' అన్నాడు ఆదుర్దాగా పూడుకపోతున్న గొంతుకతో.

'నీవెక్కడ నేనెక్కడ? నువ్వు పులివే నిజంగా. నేను తెలుసుకోలేక పోయాను. నీవేదో అశ్రద్ధగా వుండి ఆ రెండాటలూ నేను గెలిచాను. గెలిచాననే గర్వంతో కొంచెం హేళనగా మాట్లాడాను. నేనెంత ? నా ఆటెంత ? నువ్వెక్కడ ? నీ కీర్తెక్కడ ? నన్ను క్షమించు తాతయ్యా!'

'బాబూ నేను....నేనని.....' పూర్తి చేయలేకపోయాడతను.

'అవును తాతయ్యా! తెలుసుకున్నాను. మా తాతయ్య చెప్పాడు.'

'ఏ....ను....ని?' ఆగి ఆగి అడిగేడు తీవ్రంగా కొట్టుకుని వేగం తగ్గుతున్న గుండెతో ఆయన కళ్లముందు అంతా గిర్రున తిరుగుతోంది.

'నేను నవ్వుతూ యిలా యిలా జరిగిందని చెప్పేను. ఆయన నీ రూపు రేఖలు అడిగారు. చెప్పాను. అయ్యో! ఆయన పులి వేమారెడ్డి. ఆయన్ని నువ్వు గెలిచావా ? అసంభవం. గడ్డిపోచలతో ఏనుగుని బంధించవచ్చునేమో కానీ యిది అసాధ్యం అన్నాడు. కాదని విషయం చెప్పాను. ఆయన తెల్లబోయి గ్రహించుకుని, ఆశ్చర్యపోయి కోపగించుకుని నా అవిధేయతకి నన్ను తిట్టి నువ్వు పులి వేమారెడ్డిగారివని చెప్ప వెళ్ళి క్షమాపణ అడగమని తరిమేడు. అసలు నువ్వు నువ్వని తెలిస్తే నేను నీతో ఆడటానికి జంకేవాడినే ! గెలిచినా ఓడినా పండుగలాగా అయ్యేది నాకు. అలా మాట్లాడినందుకు నన్ను క్షమించు' అన్నాడు నరసింహారావు వేమారెడ్డి చేతులు పట్టుకుంటూ.

కానీ అప్పటికే స్మృతి తప్పుతున్నాడు వేమారెడ్డి.

'అసలు నేను నీకు శిష్యునిలాంటి వాడినే. నీవు ఆట బాగా నేర్పిన రామారావుగారి దగ్గరే నేనూ నేర్చుకున్నాను. అప్పుడు నేను నీతో ఆడతానని గానీ యిలాగయినా గెలుస్తానని కానీ కలలో కూడా అనుకోలేదు. పొరబాటుగా ఆడి ఓడినా గెలిచింది నీ శిష్యుని శిష్యుడే. అదీ

నీకు గర్వకారణమే....'

మెల్లిగా అతని చేతిలో ఒరిగి పోయాడు వేమారెడ్డి. గాబరాగా వంగి వేమారెడ్డి ముఖం పరిశీలించిన నరసింహారావుకి శిలాప్రతిమలా కనిపించేడు వేమారెడ్డి.

'తాతయ్యా!' ఆదుర్దాతో పట్టి కుదిపేడు మళ్ళీ. కానీ ఆ పిలుపు వినిపించనంత దూరంలో జయాపజయాలకి అతీతమైన లోకాలకి పయనిస్తున్న వేమారెడ్డి నుండి సమాధానం రాలేదు.

నివ్వెరపోయాడు నరసింహారావు.

మరుక్షణంలో వేమారెడ్డి పాదాలపై కుప్పగా కూలిపోయాడు నరసింహారావు. తను చేసిన ఘోరమైన తప్పిదం గుర్తు చేసుకుని దుఃఖిస్తూ.

● (యువ మాస పత్రిక జులై 78) ●